క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాతమంచిర్యాల: ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్, ఎకౌంటెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఫార్మాసిస్టులు, ఓటి అసిస్టెంట్‌లు, ఎఫ్‌ఎన్‌ఓలు, మధు, సురేఖ, సమత, కిరణ్, చంద్రయ్య, రాజు, శివ, ధనలక్ష్మి, రజని, విజయ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్‌లో కూలిన చెట్టు

రామకృష్ణాపూర్: భారీ వర్షం కారణంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 17వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో ఆదివారం భారీ చెట్టు నేల కొరిగింది. పక్కనే ఉన్న చిలుక దుర్గాప్రసాద్ ఇంటిపై పడటంతో ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైంది. వార్డు కౌన్సిలర్ రామిడి ఉమాదేవి మండల తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వటంతో ఆయన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు విజిత్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నస్పూర్: పట్టణ పరిధిలోని సాయి అంధుల, వృద్ధుల ఆశ్రమం మరమ్మతుల, నిర్వహణ నిమిత్తం ఎస్‌ఆర్‌పీ 3గని సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్–లావణ్య దంపతులు రూ.50,000నగదును ఆశ్రమ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సెక్రెటరీ డాక్టర్ కండె కృష్ణ, ఇన్‌చార్జి వసుమతి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పథకాలపై అవగాహన



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని 3వ వార్డు తిలక్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనాయకులు విజిత్‌రావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.40
పచ్చిమిర్చి	80
చిక్కుడు కాయ	70
బీరకాయ	60
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	50
అలసంద	60
దొండకాయ	70
సొరకాయ	40
ఆకుగోబి	60
పూగోబి	80
క్యారెట్	80
క్యాప్సికం	80
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100
బోడకాకర	220

- మంచిర్యాలఅగ్రికల్చర్



అడవుల పునఃసృష్టి

- మైదానాలుగా మారిన అటవీప్రాంతాల్లో మొక్కల పెంపకం
- వేసవిలోనే స్థలాల గుర్తింపు
- చదును చేసి ప్లాంటేషన్ల ఏర్పాటు
- పచ్చదనంపై అటవీశాఖ దృష్టి
- ఇప్పటికే 50హెక్టార్లలో మొక్కలు నాటిన అధికారులు



భీమారం అటవీప్రాంతంలో నాటిన మొక్కలు

భీమారం: మైదానప్రాంతాలను దట్టమైన అడవులుగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు అధికమొత్తంలో మొక్కలు నాటుతున్నారు. మంచిర్యాల అటవీడివిజన్ పరిధిలోని భీమారం మండలంలో 50హెక్టార్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి ఆగస్టు నెలల్లో పూర్తి చేశారు. ఒకప్పుడు దట్టమైన అడవులుగా పేరుగాంచిన భీమారం ప్రాంతంలో, నేడు అడవులు అంతరించి మైదానాలుగా మారాయి. 2000సంవత్సరంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్లు సంచారం ఎక్కువ ఉండటంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలకు రాకుండా పట్టణాలకే పరిమితమయ్యారు. దీంతో అడవుల్లోని విలువైన టేకు చెట్లని స్మగ్లర్లు నరికి, పట్టణాలకు అక్రమంగా రవాణా చేశారు. భీమారం అడవిలో టేకు కలప చాలా వరకు లేకుండా పోయింది.

అడవులకు తీవ్రనష్టం..

టేకు వనాలను నరికి కలప రూపంలో తరలించడంతో అడవులకు తీవ్ర నష్టం జరిగింది. జరిగిన నష్టాన్ని సంవత్సరాల తరబడి పట్టించుకోని ప్రభుత్వం, గత నాలుగేళ్ల నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టి, వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి సంవత్సరం టార్గెట్‌తో ప్లాంటేషన్ చేస్తున్నారు.

వేసవికాలంలో దున్నించి చదును చేసి..

వర్షాకాలంలో మొక్కలను పెంచే ప్రదేశాలను మొదటే గుర్తించిన అధికారులు, ఆ ప్రాంతమంతా ట్రాక్టర్లతో దున్నించి, చదును చేశారు. దీనివల్ల అందులో గతంలో ఉన్న చెట్ల వేళ్లు బయటపడి, కొత్తగా నాటే మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది.



ప్లాంటేషన్ వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డు

అనుకూలమైన మొక్కలు...

ఈ ప్రాంత భూములకు అనుకూలమైన మొక్కలను గుర్తించి వాటినే అటవీశాఖ వారి నర్సరీలో పెంచి నాటుతున్నారు. కానుగ, నెమిలినార, నల్లమద్ది, ఏరుమద్ది, వేప, అల్లనేరేడు, బట్టదనం, పనస, ఇరికి, కర్క, పాశి మొక్కలు ప్రధానంగా ఉన్నాయి. అయితే కోతులకు ఆహారంగా ఉపయోగపడే మొక్కలపై మాత్రం అధికారులు అంతగా శ్రద్ధ చూపలేదు. కేవలం దట్టమైన అడవులే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు.

నాటిన మొక్కలు కాపాడుతాం



మండలంలోని అటవీప్రాంతంలో చేపట్టిన ప్లాంటేషన్ వర్షాల కారణంగా పూర్తి స్థాయిలో సక్సెస్ అయింది. నాటిన ప్రతి మొక్కనూ కాపాడేందుకు చర్యలు చేపట్టాం. ప్లాంటేషన్‌లోని మొక్కలను పశువులు ధ్వంసం చేయకుండా చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాం. మొక్కలు విరిగి పోకుండా, వాటికి వెదురు కర్ర సపోర్ట్ చేశాం. మొక్కలకు ఎరువులు, నీటిని అందిస్తున్నాం.

- రామకృష్ణాసర్కార్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్

భారీ వర్షంలోనూ ఒంటరి పోరాటం



వర్షంలోనూ దీక్షలో కూర్చున్న భూమాచారి

జన్నారం: భారీ వర్షం, మోకాలి లోతు వరదనీరు, దీక్ష శిబిరం చుట్టూ చేరిన నీరు అయినా తాను దీక్షను ఆపలేదు. మొక్కవోని దీక్షతో ఒంటరి పోరాటం చేశాడు. ఈ విషయాన్ని పలువురు వీడియో, ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే జన్నారం మండలంలో.. ప్రజల, రైతుల అవసరాల కోసం 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, వారం రోజులుగా సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి రిలే నిరహార దీక్ష చేపట్టాడు. ఈయన దీక్షకు పలువురు మద్దతు తెలిపారు. పలు పార్టీల నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. అయితే ఆదివారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. రోడ్డుపై మోకాలి లోతున వరదనీరు పారుతుంది. అయినా దీక్షను విరమించలేదు. భారీ వర్షంలో కూడా భూమాచారి తన దీక్షను కొనసాగించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎస్సై సతీశ్ దీక్ష శిబిరం వద్దకు చేరుకుని ఇంటికి వెళ్లాలని భూమాచారిని కోరారు. స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్ష విరమించనని భూమాచారి తెలుపడంతో, తహసీల్దార్ వనజారెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. సబ్‌స్టేషన్ విషయంపై తనకు రాతపూర్వకంగా రాసి ఇస్తే, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. దీంతో ఆయన దీక్ష శిబిరం నుంచి ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ విషయంపై అధికారుల నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్ష విరమించనని తెలిపాడు. ఈ సందర్భంగా భూమాచారి పట్టుదలపై సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి.

పత్తి పంటపై గడ్డిమందు పిచికారీ

- మూడు ఎకరాల్లో నష్టం



గడ్డిమందు పిచికారీతో చనిపోయిన పత్తి మొక్కలు

వేమనపల్లి: పంట పెరగడానికి ఏ మందు వాడాలో, గడ్డి నిర్మూలించడానికి ఎలాంటి మందులు వాడాలో తెలియని ఓ అమాయక రైతు పత్తి పంటపై గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో మూడు ఎకరాల పత్తి మొక్కలు పూర్తిగా మాడిపోయి చనిపోయాయి. వివరాల్లోకెళ్తే.. వేమనపల్లి మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన ఎలాది శ్రీనివాస్, అతడి మామ మేకల బాపు, వేమనపల్లికి చెందిన గందేస్త్రీ శ్రీనివాస్ వద్ద మూడు ఎకరాల చేను కౌలుకు తీసుకున్నాడు. పంట ఏపుగా ఎదిగే దశలో దోమ తీవ్రత అధికంగా ఉండటంతో నివారణ కోసం మందులు తీసుకొచ్చాడు. అందులోనే పురుగు మందుల దుకాణం వద్ద దోమమందు నివారణతో పాటు గడ్డి మందు కూడా కొనుగోలు చేశాడు. అన్ని మందులను బ్యాగులో తీసుకొని చేనుకు వెళ్లి నీళ్ల డ్రమ్ముల్లో మందులు కలిపే సమయంలో దోమల నివారణ మందుతో పాటు గడ్డి మందు అవగాహన లేక అందులో వేసి కలిపాడు. అదే మందును పంటపై పిచికారీ చేయడంతో రెండు, మూడు రోజుల్లోనే పంట పూర్తిగా చనిపోయి ఎండుముఖం పట్టింది. దీంతో రైతు సుమారు రూ.లక్ష నష్టపోయినట్లు లబోదిబోమంటున్నాడు.

ఓటరు నమోదు కేంద్రాల సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆదివారం రెండో రోజు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగింది. తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఓటరు నమోదు కేంద్రాలను పర్యవేక్షిస్తుండగా, మంచిర్యాల ఆర్డీఓ రాములు ఆదివారం ఆకస్మికంగా ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. రాపల్లిలోని పోలింగ్ కేంద్రాలైన 120, 122 పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పుల కోసం ఏ విధంగా వ్యవహరిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. బూత్ లెవెల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సతీశ్, రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

పోలింగ్‌స్టేషన్‌లోని సామగ్రి పరిశీలన

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు దస్నాపూర్, నీల్వాయి, గొర్లపల్లి గ్రామాల్లోని పోలింగ్‌స్టేషన్‌లను ఆదివారం బెల్లంపల్లి ఆర్డీఓ సురేష్ పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగింపు సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ జాబితాలో ఉన్న పేర్లను ఏ విధంగా చేర్చాలి, పోలింగ్‌లోని వస్తువులపై ఆరా తీశారు. తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం ఉందా అని తహసీల్దార్ సదానందంను అడిగారు. దివ్యాంగుల జాబితాను తయారు చేసుకోవాలని ఎన్నికల రోజు వారికి అందించాల్సిన ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. నూతనంగా నమోదు చేస్తున్న ప్రతి ఓటరు ఆధార్‌కార్డు వివరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ సదానందం, డీటీ సంతోష్, ఆర్‌ఐ లక్ష్మణ్, బీఎల్‌ఓలు ఉన్నారు.



వేమనపల్లి: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ



రాపల్లి ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

రక్తనిధి కేంద్రంలో మెడికల్ క్యాంప్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రంజిత్‌కుమార్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో ఆదివారం అమెరికన్ అంకాలజీ ఆస్పత్రి హెమటాలజీ వైద్యులు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు 9గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా చూడాలని, ఐరన్ మందులు వాడాలని, వ్యాధి నయం కావడానికి బోన్‌మ్యారో మార్పిడి ఒక్కటే మార్గమని వైద్యులు రంజిత్‌కుమార్ సూచించారు. వ్యాధికి సంబంధించిన వ్యాక్సినేషన్ ఇవ్వాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధిగ్రస్తులు 1000మందికి వైద్యుల పర్యవేక్షణలో రెడ్‌క్రాస్‌సొసైటీ రక్తనిధి కేంద్రం ద్వారా వైద్య సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చందూరీ మహేందర్, కోశాధికారి రవీందర్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్, పిల్లల వైద్య నిపుణులు నాగమల్లేశ్వర్‌రావు, రక్తనిధి వైద్యులు వంశీ, సురేష్, రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



బాధితులతో మాట్లాడుతున్న రమేష్


చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో గుడిసెలు కాలిపోయిన బాధితులను రెవెన్యూ శాఖ తక్షణమే ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ డిమాండ్ చేశారు. గుడిసెలు కాలిపోయిన బాధితులను ఆదివారం పరామర్శించి, అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిలో సుమారు ఆరు నెలలుగా గుడిసెలు వేసుకొన్న వీరిపై, సుమారు 200 మంది వచ్చి, దౌర్జన్యం చేసి, పెట్రోల్ పోసి గుడిసెలను కాలబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

గట్టు మల్లన్న గుట్టపై జలపాతాలు



వేలాల గట్టు మల్లన్న స్వామి గుట్టలపై గలగలా పారుతున్న జలపాతాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. జైపూర్ మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వేలాల గుట్టపై గల గట్టు మల్లన్న స్వామి గొణపై నుంచి ఎత్తైన గుట్టల నుంచి వర్షం నీరు పారడంతో శ్రావణమాసం సందర్భంగా దర్శనానికి వచ్చిన భక్తులు చూసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రకృతి అందాలను ఫోన్లలో చిత్రీకరించిన దృశ్యాలను, వీడియోలను భక్తులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యాయి.

- జైపూర్



ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసంలో మంచిర్యాల ఆర్టీసీ డిపో కార్మిక సంఘం అధ్యక్షుడు రెంక రవి, కార్యదర్శి ఎం.డి నజీర్, కోశాధికారి రమేష్ కుమార్, వెంకటేశ్వర్‌రావు, వారి అనుచరులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల సురేఖ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దండేపల్లి: మండలంలోని పెద్దపేటకు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కండువాలు కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓలపై పనిభారం..!

- 18 మండలాలకు.. ఏడుగురే దిక్కు



మండల వనరుల కేంద్రం

చెన్నూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పలు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలుచేస్తున్నా, క్షేత్రస్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 18మండలాలకు కేవలం ఏడుగురు ఎంఈఓలు మాత్రమే ఉండడంతో, ఒక్కో ఎంఈఓకు రెండు నుంచి మూడు మండలాలను అప్పగించారు. దీంతో ఎంఈఓలపై పనిభారం పడుతోంది. దీంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతుందని, పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలంటే మండలానికి ఒక్క ఎంఈఓను కేటాయించాలని పలువురు పేర్కొంటున్నారు.

పెరిగిన బాధ్యతలు..

మండల విద్యాధికారులకు పాఠశాలల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం 'మనఊరు–మనబడి' కార్యక్రమం అప్పగించింది. 'మనఊరు–మనబడి'తో పాటు విద్యార్థులకు కనీస సామర్థ్యాల సాధన, గుణాత్మక విద్యానందించడం, స్మార్ట్ క్లాస్‌లు, డిజిటల్ క్లాస్‌లు, మధ్యాహ్న భోజన నిర్వహణ, హరితహారం లాంటి కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యతను అప్పగించారు. ప్రతి సోమవారం ప్రజావాణి, మండల పరిషత్ సమావేశాలు, జిల్లా కలెక్టర్, డీఈవోల సమీక్ష సమావేశాలకు హాజరు కావడం లాంటి పనులు ఎంఈఓలే చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఎంఈఓ వద్ద ఆయా మండలాల విద్యార్థుల సంఖ్య నుంచి ప్రభుత్వ పథకాల అమలు తీరు జాబితా తప్పని సరిగా అందుబాటులో ఉండాలి. దీంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. హెచ్‌ఎంలే ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, హెచ్‌ఎంలుగా ఉన్న పాఠశాలలో విధులు నిర్వర్తించడం కత్తిమీద సాములా మారిందని పలువురు ఎంఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ల క్రితం..

ఐదేళ్ల క్రితం ప్రభుత్వం సీనియర్ ఉపాధ్యాయులకు ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నేటి వరకు కొత్త ఎంఈఓలను నియమించలేదు. ఐదేళ్ల నుంచి ఇన్‌చార్జి ఎంఈఓలతోనే ప్రభుత్వ పాఠశాల నిర్వహణ సాగుతోంది. దీంతో జిల్లాలో ఉత్తీర్ణత శాతం ఏడాదికి, ఏడాది తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధించాలంటే, ప్రతి మండలానికి ఒక్కో ఎంఈఓను నియమిస్తే సత్ఫలితాలు వస్తాయని అంటున్నారు.

న్యాయం చేయలేకపోతున్నాం..



మండలానికి ఒక్కో ఎంఈఓను నియమిస్తే బాగుంటుంది. రెండు, మూడు మండలాల బాధ్యతలు ఉండడంతో పనిభారం పడుతోంది. అన్ని మండలాలకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నాం. ఖాళీల్లో కొత్త వారిని నియమిస్తే మరింత సత్ఫలితాలు వస్తాయి అనడంలో సందేహం లేదు.

- కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఎంఈఓ, చెన్నూర్

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా లింగయ్య

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన ఈద లింగయ్యను మాల మహానాడు మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. వర్కింగ్ ప్రెసిండెంట్‌గా మేడ రాజన్న, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్, కల్లు శంకర్, ఉపాధ్యక్షులుగా బోగి రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైదరాబాద్ తరలిన పద్మశాలీలు

భీమారం/దండేపల్లి/జైపూర్: హైదరాబాద్ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ శంఖారావ భారీ బహిరంగ సభకు జిల్లాలోని పలు మండలాలకు చెందిన పద్మశాలీలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.